కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 | సంచిక -145 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | 07-06-2026 | ఆదివారం | పేజీలు : 4

# యువతకు రేవంత్ శుభవార్త

- త్వరలో 5 వేల పోలీసు ఉద్యోగాలు
- కొత్త నోటిఫికేషన్‌పై సీఎం ప్రకటన
- 15 నెలల్లో 67,760 ఉద్యోగాలు
- హైడ్రాతో ఆక్రమణలకు చెక్
- డ్రగ్స్‌పై ఈగిల్ ఫోర్స్ యుద్ధం
- రిటైర్డ్ ఆర్మీతో హైడ్రా బలోపేతం
- ఈవీలకు జీరో టాక్స్ కొనసాగింపు
- స్కిల్స్ యూనివర్సిటీతో ఉపాధి
- మెస్సీని తెలంగాణకు ఆహ్వానించిన సీఎం
- చైనా+1 అంటే తెలంగాణే
- 20,616 కోట్ల రైతు రుణమాఫీ
- ఎకరాకు 12 వేల రైతు భరోసా
- 67 లక్షల మహిళలకు వడ్డీలేని రుణాలు
- ప్రజల కోసం సుపరిపాలనే లక్ష్యం



**న్యూస్ డెస్క్, 06 జూన్ (బిఎన్ఎస్):** అడాల్ఫ్ హిట్లర్ స్ఫూర్తితో 'హైడ్రా' ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైడ్రా అనేది హిట్లర్‌కు అత్యంత ఇష్టమైన పదం. నేను హిట్లర్ నుంచే స్ఫూర్తి పొంది 'హైడ్రా'ను ఏర్పాటు చేశానన్నారు. పేద ప్రజలు చెరువులను ఆక్రమిస్తే మానవతా దృక్పథంతో అర్థం చేసుకోవచ్చని కానీ ధనికులే జలాశయాలను ఆక్రమిస్తుండడం వల్లే తాము 'హైడ్రా' ను ఏర్పాటు చేయాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. బెంగళూరులో జరుగుతున్న 'ది హిందూ హడిల్' ఆరో ఎడిషన్ సదస్సులో రెండో రోజైన శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'ప్రజల కొరకు, ప్రజల చేత, ప్రజల కోసం: తెలంగాణలో సుపరిపాలన' అనే అంశంపై జరిగిన చర్చాగోష్టిలో రేవంత్ రెడ్డి పలు ఆసక్తికర, సంచలన విషయాలను పంచుకున్నారు. హైడ్రా వ్యవస్థ కోసం 3,000 మంది రిటైర్డ్ ఆర్మీ సిబ్బందిని తీసుకున్నామని ఈ రోజు తెలంగాణలో జలాశయాలను ఆక్రమించడానికి ఎవరూ సాహసించలేకపోతున్నారన్నారు. అలాగే, రాష్ట్రంలో యువతను పీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించేందుకు 'ఈగిల్ ఫోర్స్'ను రంగంలోకి దించామని, దేశంలోనే డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తున్న అత్యుత్తమ ఫోర్స్ ఇదేనని తెలిపారు.

త్వరలో మరో ఐదు వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్:

ఉద్యోగాల నియామకం కోసం తెలంగాణ ఉద్యమం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వంలో 2 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా కేసీఆర్ ఆ సమస్యను పరిష్కరించలేదని రేవంత్ రెడ్డి ఆరోపించారు. గతంలో ఒక ఆర్ఎంపీ డాక్టర్ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడిగా ఉన్నారని ఆయన గ్రూప్-1 అభ్యర్థులన ఇంటర్వ్యూ చేస్తాడు. ఇంజినీరు, డాక్టర్, ఇతర నియామకాలు చేసే వ్యక్తి ఓ ఆర్ఎంపీ డాక్టర్ హా? అని ప్రశ్నించారు. మేము వచ్చాక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేశామని 15 నెలల్లో మేం 67,760 ఉద్యోగాలు ఇచ్చామన్నారు. త్వరలోనే మరో 5 వేల పోలీసు ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్ ఇవ్వబోతున్నామన్నారు.

మిగతాది 2 లో..

## రేవంత్.. అబద్ధాలతో ప్రభుత్వాన్ని నడపలేవు : హరీష్ రావు




## కుక్ చేసిన చిన్న పొరపాటు.. 21 మంది ప్రాణాలు తీసింది




**న్యూస్ డెస్క్, 06 జూన్ (బిఎన్ఎస్):** దేశ రాజధాని అయిన ఢిల్లీలోని మాల్వియా నగర్ ప్రాంతంలోని 'లెమన్ గ్రీన్ రెస్టారెంట్' బేస్‌మెంట్‌లో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగడంతో భారీ ప్రమాదం చోటు చేసుకుంది. ఇందులో మొత్తం 21 మంది ప్రాణాలు కోల్పోగా పదుల సంఖ్యలో గాయపడ్డారు. కాగా ఈ ఘోర ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేశారు. ఈ భారీ అగ్ని ప్రమాదానికి హోటల్ లో పనిచేసే వంట మనిషి చెసిన చిన్న పొరపాటు కారణంగా అధికారులు గుర్తించారు.

## మోడ్రన్ టెక్నాలజీ వచ్చేసింది

### 12 రోజుల్లోనే ఇందిరమ్మ ఇంటి నిర్మాణం




**న్యూస్ డెస్క్, 06 జూన్ (బిఎన్ఎస్):** తెలంగాణ ప్రభుత్వం పేదల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో సరికొత్త సాంకేతిక విప్లవం ఆవిష్కృతమైంది. ముఖ్యంగా మారుమూల, గిరిజన ప్రాంతాలలో ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయడానికి , మధ్యలోనే పనులు ఆగిపోకుండా చూడటానికి ప్రభుత్వం 'షియర్ వాల్ టెక్నాలజీ'ని విస్తృతంగా అందుబాటులోకి తెస్తోంది. సాధారణంగా నగరాల్లోని బహుళ అంతస్తుల భవనాలకు మాత్రమే వాడే ఈ అధునాతన ఇంజనీరింగ్ విధానాన్ని, ఇప్పుడు పేదల సొంతింటి కలని త్వరగా సాకారం చేయడం కోసం ఇందిరమ్మ ఇళ్లకు అన్వయిస్తున్నారు.

## ముగిసిన కాక్రోచ్ జనతా పార్టీ నిరసన

### తెరపైకి కొత్త విద్యాశాఖ మంత్రి పేరు!

**న్యూస్ డెస్క్, 06 జూన్ (బిఎన్ఎస్):** నీట్ పేపర్ లీక్, సీబీఎస్ఈ ఓఎస్ఎం వ్యవస్థలో అవకతవకల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమం ముగిసింది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఇచ్చిన పిలుపు మేరకు వేలాది మంతి యువత జంతర్ మంతర్ వద్దకు చేరుకున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం, విద్యావిధానంలోని లోపాల వల్ల మరణించిన విద్యార్థులకు ఈ సందర్భంగా సీజేపీ నివాళులు అర్పించింది. ఈ సందర్భంగా మరణించిన విద్యార్థుల పేర్లను అభిజీత్ దీప్కే చదివి వినిపించారు. కాగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ సీజేపీ 8 లక్షల సంతకాలను సేకరించింది.




సోనమ్ వాంగ్ చుక్ మద్దతు:

సీజేపీ చేపట్టిన నిరసన కార్యక్రమానికి ప్రముఖ సామాజిక కార్యకర్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ మద్దతు తెలిపారు. స్వయంగా జంతర్ మంతర్ నిరసనలో పాల్గొన్నారు.

## ఏపీకి జాతీయ స్థాయిలో గౌరవం

### దేశంలోనే నెం.1 రూట్‌గా విశాఖ-అరకు విస్టాడోమ్ రైలు ప్రయాణం.!




**న్యూస్ డెస్క్, 06 జూన్ (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి మరో అరుదైన జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ప్రముఖ మీడియా సంస్థ 'ఇండియా టుడే' నిర్వహించిన నేషనల్ టూరిజం సర్వేలో విశాఖపట్నం-అరకు విస్టాడోమ్ రైలు ప్రయాణం దేశంలోనే అత్యుత్తమ రైలు మార్గంగా ఎంపికైంది. "ఇండియన్ రూట్స్" ఎడిటర్స్ ఛాయిస్ విభాగంలో ఈ రూట్‌కు అగ్రస్థానం దక్కడం రాష్ట్ర పర్యాటక రంగానికి ఊపును అందించేలా ఉంది.

## ఎట్టకేలకు చిక్కిన నేపాలీ గ్యాంగ్

### వెలుగులోకి షాకింగ్ నిజాలు




**న్యూస్ డెస్క్, 06 జూన్ (బిఎన్ఎస్):** మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేపాలీ గ్యాంగ్ హల్చల్ చేసిన విషయం తెలిసిందే. జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కౌకూరులో రిటైర్డ్ ప్రొఫెసర్ మురళీధర్ మోహన్ ఇంట్లో ఈ గ్యాంగ్ దోపిడీకి పాల్పడింది. తాజాగా ఈ దోపిడి కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో పరారీలో నేపాలీ గ్యాంగ్‌ను ఎట్టకేలకు పట్టుకున్నారు.గత నెల 12వ తేదీన రిటైర్డ్ ప్రొఫెసర్ మురళీధర్ మోహన్ ఇంట్లో పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన మమత, రాజేశ్ అనే పనివాళ్లు తమ సహచరులతో కలిసి దోపిడీకి పాల్పడ్డారని దర్యాప్తులో తేలింది.


## ముందు కోడిచెరువు ప్రభుత్వానికి అప్పగించు

### పవన్ కల్యాణ్‌కు కవిత కౌంటర్

**న్యూస్ డెస్క్, 06 జూన్ (బిఎన్ఎస్):** జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎదుర్కొంటున్న కోటి చెరువు కబ్జా ఆరోపణలపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. చెరువును తాను ఆక్రమించానని అనుకుంటే వెంటనే తెలంగాణ ప్రభుత్వానికి రాసిస్తానని పవన్ అన్నారని, ఈ చెరువు శిఖం భూమి అని ఇరిగేషన్ రికార్డులు స్పష్టంగా చెబుతున్నారని అందువల్ల వెంటనే పవన్ కల్యాణ్ ఆ భూమిని ప్రభుత్వానికి వెనక్కి ఇచ్చి అక్కడ వేసిన కంటెను, మట్టిని తక్షణమే తొలగించాలని కవిత డిమాండ్ చేశారు. శనివారం జూబ్లీహిల్స్ లోని టీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత.. కోడి చెరువులో భూమిని పవన్ కల్యాణ్ రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో అనేక తప్పిదాలు దొర్లాయని ఇందులో 3 ఎకరాలు మాత్రమే శిఖం భూమి అని మిగతా 7 ఎకరాలు మాగాణి అని రాశారని కానీ ఇరిగేషన్ రికార్డుల ప్రకారం ఈ 10 ఎకరాలు శిఖం భూమి అని స్పష్టంగా ఉందని దీనిపై తమ వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయన్నారు.

ఇది బరాబర్ మా జాగీరే!:

ఇటీవల పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లో మాట్లాడుతూ తెలంగాణ మీ అయ్య జాగీరా అంటూ చేసిన వ్యాఖ్యలపై కవిత ఘాటుగా స్పందించారు. ఇది బరాబర్ మా జాగీరేనని 1200 మంది అమరవీరుల త్యాగాలు, కడుపు కట్టుకుని పోరాడి తెచ్చుకున్న తెలంగాణ.. ఇక్కడి ప్రజల సొత్తు అన్నారు. ఇది పవన్ కల్యాణ్ తాతల, ముత్తాతల జాగీరు కాదన్నారు. ఆంధ్రాలో రాజధాని కట్టుకోలేక ఇక్కడికి వచ్చి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని రాజ్యాంగం ప్రకారం ఎవరైనా పోటీ చేయవచ్చు, కానీ నైతికత ఉండాలన్నారు. మీ వల్లే నాడు మా




వనరులు దోచుకోబడ్డాయి, మా సంస్కృతి మరుగున పడిపోయిందని ఆగ్రహంవ్యక్తం చేశారు. బీజేపీకి తెలంగాణలో నాయకులు లేరని అందుకే పవన్ కల్యాణ్ ను తీసుకొచ్చి రెండు ఓట్ల కోసం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీజేపీకి రాష్ట్ర ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.

# ముగిసిన కాక్రోచ్ జనతా పార్టీ నిరసన తెరపైకి కొత్త విద్యాశాఖ మంత్రి పేరు!

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా మాట్లాడిన సోనమ్ వాంగ్‌చుక్.. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల పిల్లలు కూడా ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదువుకోవాలని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత విద్యావిధానంలో మార్పు రావాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన డిమాండ్ ఆసక్తిగా మారింది. సోనమ్ తమ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాలంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ నినాదాలపై స్పందించిన సోనమ్ ఈ ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించారు. తనకు రాజకీయాల్లోకి రావాలనే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. యువత బాధ్యత తీసుకోవాలని కోరారు.

వేదికపై గందరగోళం:

సీజేపీ నిరసన కార్యక్రమంలో వేదికపా కొద్ది సేపు గందరగోళం ఏర్పడింది. సోనం వాంగ్?చుగ్ మాట్లాడుతున్న సమయంలో చాలా మంది సీజేపీ ప్రతినిధులు వేదికపై గుమ్మిగూడటంతో అక్కడ అంతా అయోమయం ఏర్పడింది. వీరిని కిందికి దిగిపోవాలని సీజేపీ వ్యవస్థాకుడు అభిజీత్ దీప్కే తో పాటు పలువురు సముదాయించిన పరిస్థితి గందరగోళంగా మారింది. ఆ తర్వాత పరిస్థితి చక్కపడటంతో వక్తలు తమ ప్రసంగాలను కొనసాగించారు. కాగా సీజేపీ పార్టీ ప్రకటించిన తర్వాత అభిజీత్ దీప్కే తొలిసారి భారత్ కు రావడంతో పాటు శనివారం జంతర్ మంతర్ వద్ద నిరసన ముగియడంతో పార్టీ భవిష్యత్ కార్యాచణ ఏంటి అనేది ఉత్కంఠగా మారింది.

# ముందు కోడిచెరువు ప్రభుత్వానికి అప్పగించు.. పవన్ కల్యాణ్‌కు కవిత కౌంటర్

మొదటి పేజీ తరువాయి

గద్దర్ కు కారు కోనివ్వడంపై..



గతంలో గద్దర్‌కు కారు కొనిచ్చానని ఇప్పుడు పవన్ చెప్పుకోవడం ఏంటి? అని కవిత ప్రశ్నించారు. కళాకారుడిని అవమానించడం ఏంటని నిలదీశారు. మీ సినిమాలకు నైజాం ప్రాంతం నుంచి ఎక్కువ ఆదాయం వస్తుందని ఆ లెక్కన మీరు కొన్న ప్రతి కారు, భూమిలో మా తెలంగాణ ప్రాంత ప్రజల డబ్బులు ఉన్నాయన్నారు. మీరు ఎంతమంది ఫోక్ సింగర్స్ ట్యూన్లను కాపీ చేసి సినిమాల్లో పెట్టుకోలేదూ? ఫోక్ సింగర్స్‌ను, చిన్న నిర్మాతలను ఎప్పుడైనా మీరు ఆదుకున్నారా?అని నిలదీశారు. మీరు ఒకటి అంటే మేము వంద అనాల్సి వస్తుందన్నారు.

అప్పుడు ఇప్పుడు కేటీఆర్ పాలనే:

తెలంగాణ వనరులను కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటోందని కవిత ఆరోపించారు. అప్పుడు గత ప్రభుత్వం కేటీఆర్ (కేసీఆర్, తన్నీరు హరీష్ రావు, రామారావు) పాలనే నడిచిందని ఇప్పుడూ కేటీఆర్ (కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి) పాలనే నడుస్తోందని విమర్శించారు. గత హాయంలో దోపిడికీ కిటికీలు తెరిస్తే ఇప్పుడు ఏకంగా తలుపులు తెరిచారన్నారు. ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ వెళ్తే భవిష్యత్ అవసరాలకు ఏమి మిగలదన్నారు. ఈ ప్రభుత్వ భూదందా అంతా బయటపెడతామన్నారు.

# యువతకు రేవంత్ శుభవార్త త్వరలో 5 వేల పోలీసు ఉద్యోగాలు

మొదటి పేజీ తరువాయి

ఈవీలపై పన్ను మినహాయింపుతో 2,000 కోట్ల నష్టం

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలకు జీరో టాక్స్ విధానాన్ని తెచ్చామని, దీనివల్ల ప్రభుత్వం రూ. 2,000 కోట్ల ఆదాయాన్ని నష్టపోతోందని వెల్లడించారు. నిరుద్యోగుల కోసం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, కార్పొరేట్ సీఈఓలే దీనికి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా ఉంటూ సిలబస్‌ను నిర్ణయించి ఉపాధి కల్పిస్తారని తెలిపారు. తనకు ఫుట్‌బాల్ అంటే ఎంతో ఇష్టమని, గతంలో క్రమంతప్పకుండా ఆడేవాడినని రేవంత్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం సమయం దొరకడం లేదన్న సీఎం.. అందుకే స్టార్ ఫుట్‌బాలర్ లియోనెల్ మెస్సిని తెలంగాణకు ఆహ్వానించానని, త్వరలోనే ఫిఫా వరల్డ్ కప్ చూడడానికి సమయం కేటాయిస్తానని ఈ సందర్భంగా సరదాగా వ్యాఖ్యానించారు. తన పోటీ పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర లేదా గుజరాత్‌లతో కాదని సీఎం స్పష్టం చేశారు. గుజరాత్‌కు పెట్టుబడులు సహజంగా రావడం లేదు, అక్కడికి వెళ్లేలా ఒత్తిడి తెస్తున్నారు. గత 20 ఏళ్లుగా అక్కడ కేవలం ఒక్క అంబాసిడర్ మాత్రమే పని చేస్తున్నారు. నా పోటీ చైనా, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలతోనే. వాటి నుంచే నేను స్ఫూర్తి పొందుతున్నాను. నా నినాదం ఒక్కటే.. 'చైనా + 1' అంటే అది 'తెలంగాణ' మాత్రమే. భవిష్యత్తులో అన్నింటినీ తెలంగాణలోనే ఉత్పత్తి చేసి చైనా స్థానాన్ని భర్తీ చేస్తామని అని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

రైతుల రుణమాఫీ చేసి చూపాం:

పంట సేకరణను కేంద్రం పట్టించుకోవడం లేదని ఎమ్మార్పీ ప్రకటించి చేతులు దులుపుకుంటోందని రేవంత్ రెడ్డి విమర్శించారు. పంట ఉత్పత్తుల సేకరణను పట్టించుకోవడం లేదని.. ధాన్యం, మొక్కజొన్నతో పాటు ఇతర పంటలు మేం సేకరిస్తున్నామన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేలు ఇస్తున్నామని చెప్పారు. గతంలో మహారాష్ట్ర తర్వాత తెలంగాణలోనే ఎక్కువ సంఖ్యలో రైతు ఆత్మహత్యలు జరిగేవన్నారు. మేము అధికారంలోకి వచ్చాక 25,035 రైతు కుటుంబాలకు చెందిన రూ.20,616 కోట్ల రుణాలను మాఫీ చేశామన్నారు. మహిళా సాధికారితకు మేం కృషి చేస్తున్నట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాల ద్వారా 67 లక్షల మంది మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు.

# కుక్ చేసిన చిన్న పొరపాటు.. 21 మంది ప్రాణాలు తీసింది

మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు పోలీసులు హోటల్ కుక్ కేశవ్ నేగిని అరెస్ట్ చేశారు.



వంటగదిలో ఎలక్ట్రిక్ స్టవ్ ఆన్ చేయగానే అది పేలిపోయిందని, దీంతో భయపడిన కుక్ హోటల్ మెయిన్ పవర్‌ను ఆఫ్ చేసి తన ప్రాణాలను రక్షించుకోవడానికి బయటకు పరుగెత్తాడు. అయితే, అతను విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో హోటల్‌లోని ఎలక్ట్రానిక్ తలుపులన్నీ లాక్ అయిపోయి, చాలామంది లోపలే చిక్కుకుపోయారు.

చివరకు బాత్‌రూమ్ తలుపులు రాకపోవడంతో ఒక విదేశీ జంట కూడా ఊపిరాడక మరణించినట్లు అధికారులు గుర్తించారు. ఇదిలా ఉంటే హోటల్ యాజమాన్యం అనేక చోట్ల భద్రతా నిబంధనలను ఉల్లంఘించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. కిటికీలు, గ్లాస్ ప్యానల్స్ అన్నీ పూర్తిగా మూసి వేయడం వల్ల దట్టమైన పొగ హోటల్ అంతా అలముకుని, బాధితులు ఊపిరాడక ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు. బేస్‌మెంట్ ప్రవేశమార్గానికి తాళం వేసి ఉండటం వల్ల రెస్క్యూ సిబ్బంది లోపలికి వెళ్లడానికి 10 నిమిషాల సమయం పట్టింది. ఈ ప్రమాదానికి సంబంధించి ఇప్పటికే హోటల్ యజమాని లవ్‌కేష్ బజాజ్‌ను పోలీసులు అరెస్ట్ చేయగా, భవనానికి ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ లేదనే నిజాన్ని ఆయన విచారణలో అంగీకరించారు.

# రేవంత్.. అబద్ధాలతో ప్రభుత్వాన్ని నడపలేవు : హరీష్ రావు

**న్యూస్ డెస్క్, 06 జూన్ (బిఎన్ఎస్):** తెలంగాణలో కృష్ణా నదీ జలాల వినియోగం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య రాజకీయ యుద్ధం పీక్ స్టేజీకి చేరింది. సీఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి టార్గెట్‌గా బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు సాక్ష్యాలతో కూడిన సుదీర్ఘమైన విమర్శనాస్త్రాన్ని సంధించారు. రాష్ట్ర ప్రభుత్వానికి కనీస అవగాహన లోపించడం వల్లే తెలంగాణ జల హక్కులు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆయన ధ్వజమెత్తారు. మే 2న నాడు తెలంగాణ ఈఎన్సీ జనరల్ కృష్ణా బోర్డుకు రాసిన అధికారిక లేఖను బహిర్గతం చేస్తూ.. కాంగ్రెస్ హయాంలో కృష్ణా జలాల్లో ఏపీ ఏకంగా 74.23 శాతం నీటిని వాడుకుంటే, తెలంగాణ కేవలం 25.77 శాతానికే పరిమితమైందని, ఈ లెక్కలు చూసైనా ముఖ్యమంత్రి తన అబద్ధాల ప్రచారాన్ని ఆపాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి 30 నెలలు దాటుతున్నా ఇరిగేషన్ అంశాలపై పాలకులు ఇంకా అవగాహన పెంచుకోకపోవడం పాలమూరు ప్రాంతానికే కాకుండా, యావత్ తెలంగాణ దురదృష్టమని ఆయన ఆక్షేపించారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తలరాతను మార్చే 12.30 లక్షల ఎకరాల సాగునీటి ప్రాజెక్టు అయిన పాలమూరు-రంగారెడ్డిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని హరీష్ రావు తీవ్రంగా మండిపడ్డారు. గతంలో ఇదే ప్రాజెక్టుపై కాంగ్రెస్ నాయకులు కోర్టుల్లో అడ్డగోలుగా కేసులు వేసి అడ్డుకున్నప్పటికీ, ఆనాటి కేసీఆర్ ప్రభుత్వం అన్ని అడ్డంకులను అధిగమించి 27,191 ఎకరాల భూసేకరణను విజయవంతంగా పూర్తి చేసి పనులను పరుగులు పెట్టించిందని గుర్తుచేశారు. కానీ, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండున్నరేళ్ల పాటు కుంభకర్ణ నిద్ర పోయి, సగం పాలనా కాలం వృథా అయిన తర్వాత ఇప్పుడు కొత్తగా భూసేకరణ ప్రతిపాదనలు అనడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ సాక్షిగా ఏడాదికి 6 లక్షల ఎకరాల చొప్పున రెండేళ్లలో 12 లక్షల ఎకరాలకు నీళ్లిస్తామని మాట తప్పిన రేవంత్ రెడ్డికి, ఇరిగేషన్ గురించి మాట్లాడే కనీస అర్హత లేదని, కోట్లు ఖర్చు పెట్టి ప్రచారం చేసుకున్నంత సులువుగా క్షేత్రస్థాయిలో ప్రాజెక్టులు కట్టలేరని హితవు పలికారు.

గత సమైక్య పాలనలో వలసలు, ఆకలి చావులతో తల్లడిల్లిన పాలమూరును సస్యశ్యామలం చేసింది కేసీఆర్ మాత్రమేనని, పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో జిల్లాలో రికార్డు స్థాయిలో 10 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించామని హరీష్ రావు స్పష్టం చేశారు. 2014 వరకు కాంగ్రెస్, టీడీపీల పెండింగ్ ప్రాజెక్టులైన కల్వకుర్తి, భీమా, నెట్టంపాడు, కోయిల్ సాగర్ ద్వారా కేవలం 27 వేల ఎకరాలు మాత్రమే సాగవ్వగా.. తాము వాటిని రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి ఆరున్నర లక్షల ఎకరాలకు సాగునీటిని విస్తరించామని గణాంకాలతో వివరించారు. చివరకు ఆర్డీఎస్ ఆయకట్టు ఎండిపోతుంటే తుమ్మిళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ కట్టి రైతులను ఆదుకున్నది తామేనని పేర్కొన్నారు. ఈ 30 నెలల కాంగ్రెస్ పాలనలో కనీసం తట్టెడు మట్టి తీయకుండా, ఒక్క కొత్త చెక్ డ్యాం కూడా కట్టకుండా కేసీఆర్ పై విమర్శలు చేయడం చేతగానితనమేనని, అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన వారు అదే అబద్ధాలతో ప్రభుత్వాన్ని ఎంతోకాలం నడపలేరని ఈఎన్సీ లేఖను జత చేస్తూ హరీష్ రావు హెచ్చరించారు.

# ఏపీకి జాతీయ స్థాయిలో గౌరవం దేశంలోనే నెం.1 రూట్‌గా విశాఖ-అరకు విస్టాడోమ్ రైలు ప్రయాణం.!

మొదటి పేజీ తరువాయి

ఈ ప్రతిష్టాత్మక అవార్డులను జూన్ 15న గోవాలో



నిర్వహించనున్న 'ఇండియా టుడే టూరిజం సమ్మిట్ అండ్ అవార్డ్స్-2026' కార్యక్రమంలో ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ తరఫున అవార్డును స్వీకరించాల్సిందిగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు ఇండియా టుడే సంస్థ అధికారిక ఆహ్వానం పంపింది. జాతీయ స్థాయి అవార్డు రావడంపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. గోవా వేదికగా జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును అందుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ గుర్తింపు ద్వారా ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా మరింత గుర్తింపు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

తూర్పు కనుమల అద్భుత ప్రకృతి సోయగాలు, సొరంగ మార్గాలు, గుహలు, పచ్చని లోయలు, జలపాతాల అందాల మధ్య సాగే విశాఖ-అరకు విస్టాడోమ్ రైలు ప్రయాణం పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ ప్రత్యేకతల కారణంగానే జాతీయ స్థాయిలో ఈ రూట్‌కు అత్యున్నత గుర్తింపు లభించిందని రాష్ట్ర పర్యాటక శాఖ వెల్లడించింది. అలాగే గోవాలో జరిగే టూరిజం సమ్మిట్‌లో దేశంలోని పర్యాటక రంగ అభివృద్ధి, కొత్త అవకాశాలు, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అంశాలపై జరిగే కీలక చర్చల్లో మంత్రి దుర్గేష్ పాల్గొననున్నారు. ఈ అవార్డు ద్వారా రాష్ట్రంలో పర్యాటకుల సంఖ్య మరింత పెరిగి, పర్యాటక రంగాభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎట్టకేలకు చిక్కిన నేపాలీ గ్యాంగ్ వెలుగులోకి షాకింగ్ నిజాలు

మొదటి పేజీ తరువాయి

ఇంట్లో పనికి చేరిన కేవలం 13 రోజులకే వారు ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. పక్కా ప్రణాళికతో దోపిడీకి దిగిన నిందితులు మురళీధర్ మోహన్‌కు మత్తుమందు ఇచ్చి, ఆయన భార్య విజయలక్ష్మిని బెదిరించి నగదు, విలువైన వస్తువులు దోచుకుని పరారయ్యారు. అనంతరం నేపాల్‌కు పారిపోవడానికి ప్రయత్నించిన సమయంలో పోలీసులు వారి జాడను గుర్తించారు. ఈ దోపిడీకి రాజేశ్, మమతలతో పాటు సబీనా, చాంగ్, సామ్రాట్, బిశ్వాల్, కమల్, శంకర్ తదితరులు కుట్ర పన్నినట్లు పోలీసులు వెల్లడించారు. కేసు దర్యాప్తులో భాగంగా గత నెల 16న సునిత, బిశ్వాల్, కమల్ బహదూర్, శంకర్‌లను సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద అరెస్ట్ చేశారు. తాజాగా పరారీలో ఉన్న మరో నలుగురు ప్రధాన నిందితులను సైతం అదుపులోకి తీసుకున్న పోలీసులు, కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు సేకరిస్తున్నారు. దోపిడీకి సంబంధించిన ఆస్తుల స్వాధీనం, ముఠా కార్యకలాపాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

ఇక ఈ కేసుపై మల్కాజ్‌గిరి సీపీ సుమతి వివరణ ఇచ్చారు. "రిటైర్డ్ ఇంట్లో ఏప్రిల్ 25 న ప్రొఫెసర్ ఇంట్లో నేపాల్‌కు చెందిన మీనా, సబీనాను పనిమనిషిగా పెట్టిస్తుంది. సబీనా భర్తగా రాజేష్‌ను ప్రొఫెసర్‌కు పరిచయం చేసింది. ఆ తర్వాత ఎంతో నమ్మకంగా విశ్వాసంగా పనిచేశారు. అంత నమ్మకాన్ని యజమానులకు, విదేశాలలో ఉన్న వారి పిల్లలకు నిందితులు కలిగించారు. గత నెల 11 న మీనా బర్త్ డే పేరుతో దోపిడీకి ప్లాన్ చేసి అమలు చేశారు. ప్రొఫెసర్ ఇంట్లో మొత్తం ఏడుగురు కలిసి దోపిడీకి పాల్పడ్డారు. దోపిడి చేసిన తరువాత ఇతర రాష్ట్రాలకు పారిపోయారు. సరిహద్దు వద్ద పెద్ద పెద్ద చిత్రాలను అతికించాము. బోర్డర్ లో తప్పించుకోవడానికి వీలు లేని పరిస్థితులను తెచ్చాం. నేపాల్‌కు వెళ్ళేందుకు నలుగురు నిందితులు ప్రయత్నం చేస్తున్నారు. ఆ టైంలోనే నిందితులను పట్టుకున్నాం. మీనా, రాజేశ్ లు నేపాల్‌కు చెందిన వారు. మమ్మల్ని తల్లిదండ్రులుగా చూస్తున్నామని నిందితులు తరుచూ మురళీధర్, విజయలక్ష్మీలకు మీనా, రాజేశ్‌లు చెప్పేవారు. అదే విషయాన్ని దోపిడీ సమయంలో నిందితులతో విజయలక్ష్మి అనింది. చాలా బాగా చూసుకున్నాము మిమ్మల్ని, మమ్మల్ని చంపొద్దని విజయలక్ష్మి కోరింది. ఇప్పటి వరకు 39 వేల 640 మందికి పైగా సురక్ష యాప్‌లో రిజిస్టర్ చేసుకున్నారు. మీనా పై 2023లో మొయినాబాద్ పీఎస్‌లో ఇప్పటికే నిందితురాలిగా ఉంది." అని సీపీ వెల్లడించారు.

# మోడ్రన్ టెక్నాలజీ వచ్చేసింది.. 12 రోజుల్లోనే ఇందిరమ్మ ఇంటి నిర్మాణం

మొదటి పేజీ తరువాయి

12 రోజుల్లోనే నిర్మాణం పూర్తి..



సాంప్రదాయ పద్ధతుల్లో ఇటుకలు, సిమెంట్‌తో ఇల్లు నిర్మించడానికి దాదాపు 90 రోజుల సమయం పడుతుంది. కానీ ఈ సరికొత్త టెక్నాలజీ ద్వారా కేవలం 12 నుంచి 15 రోజుల్లోనే ఒక పక్కా ఇందిరమ్మ ఇంటి సివిల్ నిర్మాణాన్ని పూర్తి చేసి సరికొత్త రికార్డు సృష్టించారు. ప్రైవేట్ సంస్థ 'వేదన్ ఇన్ఫ్రా' హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌తో కలిసి అల్యూమినియం/స్టీల్ ఫార్మ్‌వర్క్ (షెట్టరింగ్) విధానంలో ఈ ఇళ్లను నిర్మిస్తోంది. ఈ పద్ధతిలో కేవలం 6 నుంచి 8 మంది కార్మికులతోనే పని పూర్తవుతుంది. ఇటుకల వాడకం అస్సలుండదు. గోడలను స్టీల్, రీన్‌ఫోర్స్డ్ కాంక్రీట్ తో ఒకేసారి ఏకీకృతంగా నిర్మించడం వల్ల ప్లాస్టరింగ్ వంటి పునరావృత పనుల ఖర్చు తప్పుతుంది. అంతేకాకుండా గోడలపై పగుళ్లు వచ్చే అవకాశం అస్సలుండదు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన..

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొఠారి గ్రామంలో ఆదివాసీల కోసం ఈ టెక్నాలజీతో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇళ్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందర్శించారు. సోమవారం జరిగిన భారీ గృహప్రవేశాల కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని ఈ ప్రయోగాత్మక గృహ నిర్మాణ నాణ్యతను పరిశీలించారు. షెట్టరింగ్ వేసిన వెంటనే కాంక్రీట్ పోసి, మరుసటి రోజుకే డీషెట్టరింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన విధానాన్ని అధికారులు సీఎంకు వివరించారు. నిజామాబాద్, నాగర్‌కర్నూల్, కామారెడ్డి, మెదక్, నారాయణపేట్, సంగారెడ్డి జిల్లాల్లో ఇప్పటికే ఈ విధానంలో దాదాపు 150 ఇళ్లను విజయవంతంగా నిర్మించినట్లు గృహ నిర్మాణ సంస్థ అధికారులు తెలిపారు.

రూ.5 లక్షల బడ్జెట్.. 60 ఏళ్ల మన్నిక.

ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రూ. 5 లక్షల ఆర్థిక సహాయంతోనే, 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో హాల్, బెడ్‌రూమ్, కిచెన్, బాత్రూమ్ మరియు టాయిలెట్లతో కూడిన పూర్తి స్థాయి ఇల్లు ఈ టెక్నాలజీతో సిద్ధమవుతుంది. ముడిసరుకు రవాణా కష్టంగా ఉండే మారుమూల ప్రాంతాల లబ్ధిదారులకు, సొంత డబ్బులు పెట్టుకోలేని పేదలకు ఇది ఒక సువర్ణావకాశం. ఈ పద్ధతిలో కట్టిన ఇళ్లు బలమైన ఈదురుగాలులు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా తట్టుకుంటాయి. ఈ ఇళ్ల బాహ్య గోడలు 5 అంగుళాలు, అంతర్గత గోడలు 4 అంగుళాల మందంతో ఉండి, లోపల ఎక్కువ స్థలం లభిస్తుంది. ఈ నిర్మాణాలు దాదాపు 60 ఏళ్ల పాటు అత్యంత పటిష్టంగా మన్నికగా ఉంటాయని ఇంజనీరింగ్ నిపుణులు ధృవీకరించారు. దీనివల్ల లబ్ధిదారులపై ఎలాంటి అదనపు ఆర్థిక భారం పడకుండా వేగంగా ఇళ్లు పూర్తవుతుండటంతో, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఈ టెక్నాలజీని పెద్దపీట వేయాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది.

# రాహుల్ గాంధీతో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి భేటీ.. మంత్రి పదవి కోసమేనా?



**న్యూస్ డెస్క్, 06 జూన్ (బిఎన్ఎస్):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. రాహుల్ గాంధీతో దిగిన ఫోటోను షేర్ చేసిన రాజగోపాల్ రెడ్డి.. ఢిల్లీలో మా లీడర్‌ను కలిశాను.. అంటూ ఫోటోకు క్యాప్షన్ ఇచ్చారు. అయితే తెలంగాణలో మంత్రివర్గవిస్తరణ జరగబోతుంది అంటూ వార్తలు వస్తున్న సమయంలో రాజగోపాల్ రెడ్డి రాహుల్ గాంధీతో భేటీ అవ్వడం ప్రాధాన్యతను సంతరించుకుంది. రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి కోసమే రాజీవ్ గాంధీని కలిశారు అంటూ పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. రాజగోపాల్ రెడ్డికి కేబినెట్ బెర్త్ ఖాయం అని ఆయన అభిమానులు అంటున్నారు.

ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరవాత రాజగోపాల్ రెడ్డి మంత్రిపదవిని ఆశించారు. కానీ ఆయనకు మంత్రివర్గంలో చోటుదక్కలేదు. దానికి కారణం ఆయన కాంగ్రెస్ నుండి బీజేపీలో చేరి మళ్లీ కాంగ్రెస్ లోకి రావడమే అనే ప్రచారం జరిగింది. కానీ రాజగోపాల్ రెడ్డి మాత్రం తానే అసలైన కాంగ్రెస్ వాదినని చెప్పుకొచ్చారు. అలా అంటే ఇతర పార్టీల నుండి వచ్చిన వారికి మంత్రి పదవులు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. అనేకసార్లు తనకు మంత్రి పదవి దక్కకపోవడంపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రభుత్వంపైనా విమర్శలు కురిపించారు. ఇక ఇప్పుడు మరోసారి మంత్రివర్గ విస్తరణపై వార్తలు వస్తున్న సమయంలో రాహుల్ గాంధీతో భేటీ అవ్వడంతో కోమటిరెడ్డి కోరిక ఈసారైనా నెరవేరుతుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

# రేవంత్.. పోటీకొస్తవా..నువ్వో నేనో తేల్చుకుందాం: ఎంపీ రఘునందన్ రావు

**న్యూస్ డెస్క్, 06 జూన్ (బిఎన్ఎస్):** కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అనే బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్నారనే విషయం మరిచిపోవద్దని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. సీఎం స్థానంలో ఉన్న రేవంత్ రెడ్డి గౌరవప్రదంగా మాట్లాడితే మీకు మాకు గౌరవంగా ఉంటుందన్నారు. అలా కాదని ఎవరు ఎక్కువగా బూతులు మాట్లాడుతారో పోటీ పెట్టుకుందామంటే మేము కూడా రెడీగా ఉన్నామన్నారు. మేము కూడా జై తెలంగాణ అని అన్నవాళ్లమే ఈట్ క జవాబ్ పత్తర్ సే దేంగే అన్నవాళ్లమేనన్నారు. మీరు ఒకటి అంటే మేము నాలుగు అనే స్థానంలో ఉన్నామని కానీ బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నాం కాబట్టి గౌరవప్రదంగా మాట్లాడుదామన్నారు. చేతనైతే గణాంకాల మీద చర్చించడానికి ఏ చౌరస్తాకు వస్తారో చెప్పండి మేమూ వస్తామన్నారు. 2014-15 లో వడ్లకు రూ.1300 ఉన్న ఎంఎస్పీ ఇప్పుడు రూ.2300 అయిందని తాము రైతుల కోసం పని చేస్తున్నామని చెప్పడానికి ఇది చాలన్నారు. వరంగల్ జిల్లాలో పర్యటించిన ఆయన ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు.

మొరిగే ప్రతీ కుక్కకు సమాధానం చెప్పనవసరం లేదు:

కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ బీజేపీనే విమర్శిస్తున్నాయని మండిపడ్డారు. అధికారం కోల్పోయిన వారికి తాము మళ్లీ రామని తెలుసని, అధికారంలో ఉన్నవారికి ఎన్నికలు వస్తే మళ్లీ అధికారంలోకి రామని తెలుసన్నారు. ఈ దేశానికి మరోసారి నరేంద్ర మోడీ ప్రధాని అవుతారన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో మొరిగే ప్రతీ కుక్కకు సమాధానం చెప్పనవసరం లేదన్నారు. ఎన్నికల సంఘం వద్ద 6 వేలకు పైగా రాజకీయ పార్టీలు రిజిస్టర్ అయి ఉన్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ వచ్చినా కాక్రోచ్ ఎర్త్ వామ్ పార్టీలు వచ్చినా మాకు ఏ సమస్య లేదన్నారు.

రోజా మీకు పెండ బిర్యానీ పెట్టారా?

తెలంగాణలో పవన్ కల్యాణ్ మీటింగ్ పై రద్దాంతం చేస్తున్న కవిత గతంలో బీఆర్ఎస్ పేరుతో వివిధ రాష్ట్రాల్లో తలదూర్చినప్పుడు ఎందుకు అడ్డు చెప్పలేదని రఘునందన్ రావు ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీ పెట్టవచ్చు, పోటీ చేయవచ్చన్నారు. ఆంధ్ర బిర్యానీ పెండ బిర్యానీ అని గతంలో కేసీఆర్ అన్నారు. మరి రోజా ఇంటికి వెళ్లినప్పుడు మీకు ఆమె పెండ బిర్యానీ పెట్టిందా లేక మంచి బిర్యానీ పెట్టిందా అని ప్రశ్నించారు. కేసీఆర్ మాట్లాడితే కరెక్ట్ మిగతా వాళ్లు మాట్లాడితే తప్పు అంటే ఎలా అన్నారు. పవన్ కల్యాణ్ ఆవేశపూరితంగా ఏం మాట్లాడారో నేను వినలేదన్నారు. పవన్ కల్యాణ్ మాట్లాడితే ఎందుకంత ఉలిక్కి పడుతున్నారని ప్రశ్నించారు. వారి ఉనికికి ప్రమాదం వచ్చినప్పుడు అందరికి ప్రమాదం వచ్చినట్లు అనుకోవాలనుకుంటున్నారని మండిపడ్డారు.

# విద్యుత్ ప్రమాదాల నివారణకు " వన్ మినిట్ రూల్ "

నెల్లూరు(బిఎన్ఎస్):-నెల్లూరు జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘవేంద్రం జిల్లాలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మరియు ఖూరా సోలార్ వెండర్స్‌తో సోలార్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్. ఈ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉచిత సోలార్ విద్యుత్ పథకంలో అర్హులైన లబ్ధిదారులకు వెంటనే సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు మరియు వెండర్స్‌కు ఆదేశించారు. ప్రతి డివిజన్‌లో సోలార్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యుత్ రంగంలో పనిచేసే సిబ్బంది భద్రతకు అత్యున్నత స్థానం ఇవ్వాలని ఈ వన్ మినిట్ రూల్ తప్పనిసరిగా పాటించాలని ఈ నియమం ద్వారా ప్రతి పనికి ముందుగా కేవలం ఒక్క నిమిషం సమయం కేటాయించి అవసరమైన భద్రతా చర్యలను పరిశీలించడం తప్పనిసరి చేసుకోవాలని దీని ద్వారా ప్రమాదాలను తగ్గించి సిబ్బంది ప్రాణాలు కాపాడుకోవచ్చని చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారి చేసే అవకాశం ఉన్నందున ఈ ఒక్క నిమిషం సమయం



ప్రాణాలను కాపాడగలదని ఎస్సీ తెలిపారు.

ఇలాంటి పరిస్థితుల్లో పోల్స్ ఎక్కే ముందు, ఎల్.సి తీసుకున్న తర్వాత, పనులు ప్రారంభించే ముందు ప్రతి ఉద్యోగి "ఒక్క నిమిషం" ఆలోచించి అన్ని భద్రతా చర్యలు సరిచూసుకుని మాత్రమే పనులు ప్రారంభించాలని సూచించారు. ప్రతి ఉద్యోగి మనసులో "ఒక్క నిమిషం" అనే భద్రతా భావన నాటుకుపోవాలని, అది ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. అలాగే రెవెన్యూ కలెక్షన్లు పెంచడంతో పాటు విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని, వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కావలి బెనర్జీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టౌన్ శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ట్రాన్స్‌ఫార్మర్స్ లక్ష్మీనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజిలెన్స్ సుధాకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆత్మకూరు భాను నాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోవూరు రమేష్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గూడూరు నరేంద్ర రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నెల్లూరు రూరల్స్ ప్రసాద్ తదితరులు మరియు సోలార్ వెండర్స్ పాల్గొన్నారు.

# జ్ఞాన ప్రకాష్ శిక్షణా శిబిరాన్ని పరిశీలించిన జిల్లా విద్యాశాఖ అధికారులు



నెల్లూరు జిల్లా రాపూరు (బిఎన్ఎస్):- నెల్లూరు జిల్లా, రాపూరు మండలంలోని ఎస్ బి టి, జి జి హెచ్ ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న జ్ఞాన ప్రకాష్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ)" మూడవ రోజు శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారులు శనివారం ఆకస్మికంగా పరిశీలించారు, జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుండి ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ ఎ. రమేష్ కుమార్, అసిస్టెంట్ అకాడమిక్ మానిటరింగ్ అధికారి (ఉర్దూ) పి. కరీం ఖాన్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించి, తరగతి గదుల్లో ఉపాధ్యాయుల భాగస్వామ్యాన్ని, బోధనా పద్ధతులను ప్రత్యక్షంగా వీక్షించారు, ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. నూతన జాతీయ విద్యా విధానం ఆశయాలకు అనుగుణంగా ప్రాథమిక విద్యలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని పిలుపునిచ్చారు. 1 నుండి 3 వ తరగతి విద్యార్థులలో కనీస చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలను పెంపొందించడమే నిపుణ్ భారత్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ 6 రోజుల శిక్షణలో నేర్చుకున్న నూతన బోధనా పద్ధతులను నేరుగా తరగతి గదుల్లో అన్వయించి, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులను కోరారు, ఉపాధ్యాయుల అంకితభావంతోనే మెరుగైన భావి భారత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు, ఈ కార్యక్రమంలో రాపూరు మండల విద్యాశాఖ అధికారులు జి. శ్రీనివాసులు, షేక్ జిలానీ బాషా, రిసోర్స్ పర్సన్లు మరియు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉప్మాక హుండీ దొంగల కోసం పోలీసుల గాలింపు

## సీసీటీవీ చిత్రాల ఆధారంగా గుర్తింపునకు ప్రజల సహకారం కోరిన పోలీసులు

అనకాపల్లి జిల్లా,నక్కపల్లి, జూన్ 6,బిఎన్ఎస్:: ఉప్మాక శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఇటీవల చోటుచేసుకున్న హుండీ దొంగతనం ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ నెల 3వ తేదీన జరిగిన ఈ ఘటనకు సంబంధించి దేవస్థానంలోని సీసీటీవీ కెమెరాల్లో నమోదైన అనుమానితుల చిత్రాలను పోలీసులు విడుదల చేశారు.



సీసీటీవీ ఫుటేజీలో కనిపిస్తున్న వ్యక్తులను ఎవరైనా గుర్తుపట్టినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని నక్కపల్లి పోలీసులు విజ్ఞప్తి చేశారు. అనుమానితుల వివరాలు తెలిసిన వారు నక్కపల్లి సీఐ జె. మురళి (9440796105) లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. దర్యాప్తులో భాగంగా అనుమానితుల ఫొటోలు, వీడియోలను వాట్సాప్ గ్రూపులు, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని పోలీసులు కోరారు. గ్రామస్థాయిలో ప్రజలకు ఈ చిత్రాలను చూపించి నిందితుల గుర్తింపునకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.హుండీ దొంగతనం కేసును ఛేదించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సీఐ జె. మురళి తెలిపారు. ప్రజల నుంచి వచ్చే సమాచారాన్ని గోప్యంగా ఉంచి, నిందితులను త్వరలోనే పట్టుకునేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఖరీఫ్ పనులకు ఇదే సరైన సమయం.



చింతపల్లి బిఎన్ఎస్ న్యూస్ :- ఏజెన్సీ ప్రాంతంలో ఖరీఫ్ సాగు సన్నాహకాలకు అనుకూల వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ ఆళ్ళ అప్పలస్వామి తెలిపారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం జూన్ 6 నుంచి 10వ తేదీ వరకు అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

ఈ కాలంలో 3.8 నుంచి 7 మిల్లీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశముందని, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 32.9 నుంచి 33.5 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 21.2 నుంచి 21.8 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉండనున్నాయని వివరించారు. ఉదయం వేళల్లో గాలిలో తేమ 60 నుంచి 70 శాతం, మధ్యాహ్నం 45 నుంచి 65 శాతం వరకు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. గంటకు సుమారు 5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచనున్నాయని తెలిపారు.

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు ఖరీఫ్ సాగుకు అనుకూలంగా ఉన్నందున రైతులు కురిసిన వర్షాలను సద్వినియోగం చేసుకుని ప్రాథమిక దుక్కులు, భూమి చదునుచేయడం, గట్లు బలోపేతం చేయడం, నీటి పారుదల కాలువల ఏర్పాటును పూర్తిచేయాలని సూచించారు. వరి, రాగి పంటల నారుమడుల ఏర్పాటుకు ఇదే సరైన సమయమని పేర్కొన్నారు. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని విత్తన శుద్ధి అనంతరం విత్తితే మొలక శాతం పెరగడంతో పాటు తెగుళ్ల నివారణకు దోహదపడుతుందని తెలిపారు.

మొక్కజొన్న, పసుపు సాగు చేపట్టే రైతులు ఆరోగ్యకరమైన విత్తనాలు, దుంపలను మాత్రమే వినియోగించాలని సూచించారు. భూమి తయారీ సమయంలో బాగా కుళ్లిన పశు వుల ఎరువు లేదా కంపోస్టును వినియోగించడం వల్ల నేల సారవంతత పెరుగుతుందన్నారు.

వాతావరణ సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు పనులు చేపడితే ఖరీఫ్ సీజన్‌లో మెరుగైన దిగుబడులు సాధించే అవకాశం ఉందని అప్పలస్వామి పేర్కొన్నారు.

# భక్తి చాటిన కోరా జగదీష్.. భారీ విరాళం



అనకాపల్లి జిల్లా,జూన్ 6: అయ్యప్ప స్వామివారి ఆలయ నిర్మాణానికి కొర్రుప్రోలు గ్రామానికి చెందిన కోరా సత్తిరాజు కుమారుడు కోరా జగదీష్ రూ.20,116లను విరాళంగా అందజేసి తన భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. ఆలయ నిర్మాణ కార్యక్రమానికి భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరిస్తుండటం హర్షణీయమని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జగదీష్ కుటుంబ సభ్యుల దాతృత్వాన్ని కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. అయ్యప్ప స్వామివారి అనుగ్రహంతో జగదీష్ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు, భోగభాగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

ఆలయ నిర్మాణానికి భక్తులు అందిస్తున్న సహకారం భవిష్యత్తులో మరెందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అయ్యప్ప స్వామివారి సేవలో భాగస్వాములవుతున్న ప్రతి దాతకు కమిటీ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎమ్మార్పీఎస్ 'గో టు విలేజ్' కార్యక్రమం విజయవంతం.



చింతపల్లి, బిఎన్ఎస్ న్యూస్ :- అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలోని అంబేద్కర్ కాలనీలో ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'గో టు విలేజ్' కార్యక్రమం కొనసాగుతోంది. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సూచనల మేరకు జాతీయ బ్యూరో సభ్యుడు సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు మోర్త బుజ్జిబాబు ఆధ్వర్యంలో మే 25 నుంచి జూలై 5 వరకు 40 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మాదిగల సమావేశాన్ని ఏర్పాటు చేసి కార్యక్రమ లక్ష్యాలను వివరించారు. విద్య ప్రాధాన్యతపై అవగాహన కల్పించడం, ఎమ్మార్పీఎస్ అనుబంధ విభాగాలకు గ్రామ, మండల స్థాయిలో కొత్త కమిటీలను ఏర్పాటు చేయడం, ఇంకా జెండా ఆవిష్కరణలు జరగని గ్రామాల్లో వంద శాతం దండోరా జెండాలను ఆవిష్కరించడం ప్రధాన ఉద్దేశ్యాలని తెలిపారు.అదే క్రమంలో నాయకులు మాట్లాడుతూ, మాదిగలను రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఓట్ల కోసమే వినియోగించుకుంటున్నాయని ఆరోపించారు. అల్లూరి జిల్లాలో ఎస్సీ రిజర్వేషన్లకు అనుగుణంగా సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని, అర్హులైన మాదిగలకు ఇళ్ల స్థలాలు, గృహాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

# "కడప" దేశానికే అభివృద్ధి కేంద్రం




కడపజిల్లా (బిఎన్ఎస్) జూన్ 06: రాబోయే రెండు దశాబ్దాల్లో కడపజిల్లా పారిశ్రామిక, వ్యవసాయ,ఇంధన, పర్యాటక రంగాల్లో విశేష పురోగతి సాధించి దేశవ్యాప్తంగా ఆదర్శ జిల్లాగా నిలుస్తుందని మంత్రి సత్యకుమార్, జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి ఆశాభావం వ్యక్తం చేశారు."రైజింగ్ రాయలసీమ"సదస్సులో ఆయన మాట్లాడుతూ.. రాయలసీమ ప్రస్తుతం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతంగా గుర్తింపు పొందుతోందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కడపజిల్లా కీలక భాగస్వామిగా మారుతోందని, రాష్ట్రంలో అన్ని రంగాల్లో ముందంజలో ఉన్న టాప్-10 జిల్లాల్లో నాలుగు జిల్లాలు రాయలసీమకు చెందినవే కావడం గర్వకారణమని పేర్కొన్నారు.ప్రతి సంవత్సరం దాదాపు 10 శాతం వృద్ధి రేటుతో రాయలసీమ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని తెలిపారు. రవాణా రంగంలో కూడా కడప వేగంగా అభివృద్ధి చెందుతోందని,జిల్లాలో 490 కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయనిచెప్పారు.బెంగళూరు,విజయవాడ జాతీయ రహదారి పనులు మరో ఆరు నెలల్లో పూర్తయ్యే అవకాశం ఉందని,దీంతో వ్యాపార,వాణిజ్య రంగాలకు మరింత ఊతం లభిస్తుందని వివరించారు.కోపర్తిపారిశ్రామిక ప్రాంతంలో టీవీ మానిటర్ల తయారీ యూనిట్ ఏర్పాటవడం దేశానికే గర్వకారణమని పేర్కొన్నారు.

# మహిళలకు భద్రత ప్రాధాన్యం



అమరావతి,జూన్ 6(బిఎన్ఎస్ ) : మహిళలపై జరుగుతున్న నేరాల్లో 17 శాతం తగ్గుదల సాధించడంతో పాటు, రోడ్డు ప్రమాదాల నివారణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టిన మార్కాపురం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పనితీరును హోం మంత్రి వంగలపూడి అనిత అభినందించారు.

నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లా పోలీసు అధికారులతో రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత కనిగిరిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాకు సంబంధించిన భౌగోళిక పరిస్థితులు, పోలీసు పరిపాలనా విభజన, సర్కిళ్లు, మండలాల పరిధి, శాంతిభద్రతలు, నేర నియంత్రణ తదితర అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, మహిళలు, బాలికల భద్రత, రక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, మైనర్ బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ ప్రతిష్టను పెంచే విధంగా అధికారులు తమ విధులను నిర్వహించాలని సూచించారు.

ఈ సమావేశంలో మార్కాపురం డీఎస్పీ యు. నాగరాజు, కనిగిరి ఇన్‌చార్జి డీఎస్పీ పి. శ్రీధర్, సిఐలు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలకు పవన్ మాస్టర్ ప్లాన్.. 268 మోడల్ పంచాయతీలు సిద్ధం.!

బిఎన్ఎస్: రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, పర్యావరణహితంగా నిర్వహించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భారీ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. దీనిలో భాగంగా గోదావరి మోడల్ పుష్కర్ పంచాయతీ ప్రణాళికపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కాలుష్య రహిత గోదావరి పుష్కరాల నిర్వహణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పవిత్రమైన గోదావరి నదిలోకి పంచాయతీల నుండి చుక్క మురుగు నీరు కూడా కలవకూడదని ఆయన అధికారులను ఆదేశించారు. జీరో లిక్విడ్ డిశ్చార్జి (వ్యర్థ జలాలు నదిలోకి విడుదల కాని) పంచాయతీల ఏర్పాటుతో గోదావరి పుష్కరాలకు మరింత శోభ రానుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



268 మోడల్ పంచాయతీలు.. మ్యాజిక్ డ్రెయిన్లతో శాశ్వత పరిష్కారం

గోదావరి పుష్కరాల కోసం ప్రభుత్వం ఒక సమగ్రమైన వ్యూహాన్ని అమలు చేయబోతోంది. దీనిలో భాగంగా పుష్కర పరిసరాల్లోని 268 గ్రామ పంచాయతీలను మోడల్ పంచాయతీలుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ గ్రామాల నుండి మురుగు నీరు నదిలోకి కలవకుండా నిరోధించడానికి ప్రతి పంచాయతీకి ఒక ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అవసరమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గతంలో పెదపెంకి వంటి గ్రామాలలో మంచి ఫలితాలను ఇచ్చిన మ్యాజిక్ డ్రెయిన్ల విధానాన్ని ఇక్కడ కూడా ఉపయోగించి, మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.

మునికూడలి ఘాట్‌కు 'సప్తర్షి పుష్కర్ ఘాట్'గా నామకరణం

ఈ పుష్కరాలలో మునికూడలి పుష్కర ఘాట్‌ను ఒక ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి నమూనాగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఈ ఘాట్‌కు 'సప్తర్షి పుష్కర్ ఘాట్'గా కొత్త నామకరణం చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి ప్రకటించారు. దేశంలోనే మొట్టమొదటి జీరో లిక్విడ్ డిశ్చార్జి పంచాయతీగా మునికూడలిని నిలపడమే తమ సంకల్పమని ఆయన పేర్కొన్నారు. ఈ ఘాట్ వద్ద ఒకేసారి 75 వేల మంది భక్తులు ఎటువంటి ఇబ్బంది లేకుండా పుష్కర స్నానం చేసేలా భారీ ఏర్పాట్లు చేయనున్నారు.

సమన్వయంతో పనులు.. భక్తులకు మౌలిక వసతులు

పుష్కర ఘాట్లు, పుష్కర నగర్లలో భక్తుల రద్దీకి అనుగుణంగా మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఘాట్ల విస్తరణతో పాటు వాహనాల నిలుపుదల (పార్కింగ్), వీధి దీపాలు, దుస్తులు మార్చుకునే గదులు (డ్రెస్సింగ్ రూమ్స్), రోడ్లు , డ్రెయినేజీల ఆధునీకరణ పనులను ముందస్తుగానే పూర్తి చేయనున్నారు. వాహనాల నిలుపుదల స్థలాల కోసం స్థానిక రైతుల సహకారాన్ని తీసుకోనున్నారు. ఈ పద్ధతిలో రైతులకు కూడా లబ్ధి చేకూర్చేలా, అక్కడ వచ్చే ఆదాయంలో వారికి తగిన వాటా కల్పించే యోచనలో ప్రభుత్వం ఉంది.

దీనితో పాటు దేవాదాయ శాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రధాన ఘాట్లలో ప్రత్యేకంగా 'గోదావరి హారతి' ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ఈ ప్రాంతంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన సోమేశ్వరాలయం, వేణుగోపాల స్వామి ఆలయాల ఆధునీకరణ పనులను కూడా వేగవంతం చేయనున్నారు. రాబోయే క్యాబినెట్ సమావేశం ముగిసిన వెంటనే తాను స్వయంగా మునికూడలి ఘాట్‌ను సందర్శించి పనుల పురోగతిని పరిశీలిస్తానని డిప్యూటీ సీఎం తెలిపారు. పుష్కరాల నిర్వహణను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# శిశువుల ఆరోగ్య ప్రమాణాల గుర్తింపునకు 'ఏఐ' సేవలు: మంత్రి సత్యకుమార్



అమరావతి, బిఎన్ఎస్:: ఏపీలో నవజాత శిశువుల ఆరోగ్య ప్రమాణాల గుర్తింపునకు ఏఐ ఆధారిత సేవలు వినియోగించనున్నట్లు వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఇందులో భాగంగా మొబైల్ ద్వారా నవజాత శిశువుల బరువు, ఎత్తు, ఇతర వివరాలను నమోదు చేయనున్నారు. దీనికోసం ఆశా యాప్‌తో 'శిశు మాపన్' యాప్‌ను అనుసంధానించనున్నారు. దీని కోసం మంగళగిరి నియోజకవర్గంలోని ఆశాలు, ఏఎన్ఎంలకు శిక్షణ కార్యక్రమాలను దశల వారీగా ప్రారంభించే ప్రక్రియ మొదలైందని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఇక్కడి ఫలితాలను అనుసరించి ఈ సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని చెప్పారు.

# సినిమా న్యూస్

## దసరాకు విడుదల ఖాయం?



నందమూరి నటసింహం బాలకృష్ణ ప్రస్తుతం గోపీచంద్ మాలినేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమాకు ఇప్పటివరకు అధికారిక టైటిల్ ప్రకటించకపోవడంతో, తాత్కాలికంగా 'ఎన్బీకే111' అనే వర్కింగ్ టైటిల్‌తో షూటింగ్ కొనసాగుతోంది. ఈ చిత్రాన్ని ఈ ఏడాది దసరా సందర్భంగా విడుదల చేయాలని మొదటగా మేకర్స్ భావించినట్లు సమాచారం. ఒకవేళ ఆ సమయానికి విడుదల సాధ్యం కాకపోతే వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని కూడా ప్లాన్ చేసినట్లు వార్తలు వినిపించాయి.

అయితే తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా దసరాకే ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫస్ట్ హాఫ్ షూటింగ్ దాదాపు పూర్తయినట్లు సమాచారం. మిగతా షూటింగ్ కూడా త్వరలోనే పూర్తి చేయాలని చిత్రబృందం ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో దసరా విడుదలపై మరింత విశ్వాసం వ్యక్తమవుతోంది. అదేవిధంగా ఈ సినిమాకు సంబంధించిన ఓ కీలక అప్‌డేట్‌ను బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా జూన్ 10న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ ప్రత్యేక అప్‌డేట్‌పై బాలయ్య అభిమానులతో పాటు సినీ వర్గాల్లో కూడా భారీ ఆసక్తి నెలకొంది.

## 'వారణాసి' స్టోరీ లీక్

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు రాజమౌళి కాంబోలో రాబోతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'వారణాసి'. ఇందులో గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తుండగా.. పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన స్టోరీ ఇదేనంటూ ప్రముఖ రచయిత, రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ చిత్రంలో రామాయణంలోని 'రామ-కుంభకర్ణ' యుద్ధం నేపథ్యంలో సాగే ఒక అరగంట హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ ఉండబోతోందని విజయేంద్ర ప్రసాద్ వెల్లడించారు. ట్రైలర్‌లో చూసినట్లుగా హనుమంతుడి తోక, రథం వంటి అంశాలతో కూడిన ఈ యుద్ధం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

తాజా సమాచారం ప్రకారం.. ఈ 30 నిమిషాల పోరాట ఘట్టం సినిమాకే అతిపెద్ద హైలైట్‌గా నిలవనుందని టాక్. ఇందులో మహేష్ బాబు డ్యూయల్ రోల్ చేస్తుండటం విశేషం. ఆయన ఆధునిక అడ్వెంచరర్ 'రుద్ర' పాత్రతో పాటు, 'శ్రీరాముడి' పాత్రలోనూ కనిపించనున్నారట. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా విభిన్న లొకేషన్లలో షూటింగ్ జరుపుకుంటున్న 'వారణాసి', అంటార్కిటికా ఖండంలో భారీగా షూటింగ్ జరుపుకున్న మొదటి భారతీయ సినిమాగా చరిత్ర సృష్టించింది. ప్రకాష్ రాజ్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ విజువల్ వండర్‌ను 2027లో థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మొత్తానికి విజయేంద్ర ప్రసాద్ కామెంట్స్ ఈ సినిమాపై మరింత హైప్ క్రియేట్ అయింది. ఇక ఈ విషయం తెలుసుకున్న సూపర్ స్టార్ ఫ్యాన్స్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. థియేటర్స్‌లో ఎప్పుడెప్పుడు చూస్తామా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




## 'కల్కి 2' నాన్-స్టాప్ షూటింగ్!

వైజయంతి మూవీస్, స్వప్న సినిమాస్ బ్యానర్లపై 'కల్కి' డైరెక్టర్ నాగ్ అశ్విన్ నిర్మాతగా, లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో రూపొందిన మోస్ట్ అవేటెడ్ ఎక్స్‌పెరిమెంటల్ మూవీ 'సింగ్ గీతం'. జూన్ 11న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో.. నిర్మాత నాగ్ అశ్విన్ ప్రమోషన్స్ లో భాగంగా విలేకర్లతో ముచ్చటించారు. ఈ ఇంటర్వ్యూ ముగింపులో టాలీవుడ్ మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ 'కల్కి 2' గురించి ఆయన ఇచ్చిన క్రేజీ అప్‌డేట్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న 'కల్కి 2' అప్‌డేట్ గురించి నాగ్ అశ్విన్ క్లారిటీ ఇచ్చారు. సినిమా పనుల గురించి లీక్ చేస్తూ.. "కల్కి 2 షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. వచ్చే నెల (జూలై) నుండి కంటిన్యూగా షూటింగ్ ప్లాన్ చేశాం. చాలా శరవేగంగా షూటింగ్ పూర్తి చేసేలా అన్ని సన్నాహాలు జరుగుతున్నాయి" అని నాగ్ అశ్విన్ అధికారికంగా వెల్లడించారు. ఈ అప్‌డేట్‌తో ప్రభాస్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.ఇక దేవిశ్రీ ప్రసాద్ సంగీత సారథ్యంలో, సాధారణ డైలాగ్స్ లేకుండా కేవలం పాటల రూపంలోనే సాగే సరికొత్త నాన్-స్టాప్ మ్యూజికల్ వింతగా రాబోతున్న 'సింగ్ గీతం' జూన్ 11న థియేటర్లలో ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి!



## జాన్వీ సీన్లు కట్ చేసిన 'పెద్ది'!



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట కొనసాగిస్తున్నప్పటికీ.. సినిమాలో హీరోయిన్ జాన్వీ కపూర్ క్యారెక్టరైజేషన్, ఆమె లవ్ ట్రాక్‌పై సోషల్ మీడియాలో విపరీతమైన నెగెటివిటీ వ్యక్తమవుతోంది. నెటిజన్లు, సినీ క్రిటిక్స్ నుంచి కూడా తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తమవడంతో ఎట్టకేలకు దర్శకుడు బుచ్చిబాబు ఒక సంచలన నిర్ణయం తీసుకున్నారు. 'పెద్ది' చిత్రంలో వివాదాస్పదంగా మారిన జాన్వీ కపూర్ సీన్లపై ఆయన వెనక్కి తగ్గారు. ఈ సినిమాలో జాన్వీ కపూర్ పాత్రకు సంబంధించిన కొన్ని అభ్యంతరకర సన్నివేశాలను థియేటర్ల నుండి తొలగిస్తున్నట్లు (ట్రిమ్ చేస్తున్నట్లు) దర్శకుడు బుచ్చిబాబు తన అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా సంచలన ప్రకటన చేశారు.

సినిమా అనేది కేవలం ప్రేక్షకులను అలరించడానికే గానీ.. ఎవరినీ ఇబ్బంది పెట్టడానికి, ఎవరి గౌరవానికి భంగం కలిగించడానికి కాదని బుచ్చిబాబు స్పష్టం చేశారు. 'పెద్ది' సినిమాలోని కొన్ని సన్నివేశాలపై ఆడియన్స్ నుంచి వచ్చిన నెగెటివ్ ఫీడ్‌బ్యాక్‌ను ఒక దర్శకుడిగా తాను చాలా సీరియస్‌గా తీసుకున్నట్లు వెల్లడించారు. సినిమాలో జాన్వీ కపూర్ ప్రెజెంటేషన్ ఎవరినైనా బాధించి ఉంటే.. ప్రేక్షకుల సెంటిమెంట్లను మనస్ఫూర్తిగా గౌరవిస్తూ ఆయన హృదయపూర్వక క్షమాపణలు తెలియజేశారు.

మారుతున్న ప్రేక్షకుల ఆలోచనలు, వారి సెన్సిటివిటీస్‌కు తాము బాధ్యత వహిస్తామని.. భవిష్యత్తులో తీయబోయే చిత్రాల్లో మహిళా పాత్రలను మరింత గౌరవప్రదంగా, పద్ధతిగా చూపిస్తానని బుచ్చిబాబు ప్రామిస్ చేశారు. ఈ మేరకు థియేటర్లలో ఉన్న అభ్యంతరకర సన్నివేశాలను మార్చబోతున్నట్లు వెల్లడించారు.శనివారం సాయంత్రం షోల నుంచే ఈ ట్రిమ్ చేసిన సరికొత్త వెర్షన్ ప్రేక్షకులకు థియేటర్లలో అందుబాటులోకి రానుంది. తప్పును ఎత్తిచూపినప్పుడు ఈగోలకు పోకుండా, ప్రేక్షకుల అభిప్రాయాన్ని గౌరవించి తక్షణమే సీన్లను లేపేయాలని బుచ్చిబాబు తీసుకున్న ఈ నిర్ణయంపై ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.